

ఎస్పీ స్పందనకు 35 అర్జీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చట్టపరమైన సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. ఫిర్యాదుకు సంబంధించిన స్టేషను ఇన్‌స్పెక్టర్, డీఎస్పీలతో జూమ్ ద్వారా బాధితుల సమక్షంలోనే ఎస్పీ మాట్లాడి మరొక సారి అదే విధమైన సమస్య రాకుండా పరిష్కారం చేయాలని ఆదేశించారు.స్పందనకు వచ్చిన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీకి అందిన అర్జీల్లో ఈస్ట్ జోన్‌కి సంబంధించినవి 12, నార్త్ 9, సౌత్ 2, సెంట్రల్ జోన్‌కి చెందినవి 5, కొవ్వూరు సబ్‌డివిజన్ పరిధి నుంచి 6, దిశ 1 ఉన్నాయి.

ప్రజల సమస్యలను పరిష్కరించండి : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 : ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఏ ఒక్క అర్జీదారుడు మళ్లీ అదే సమస్యపై స్పందనకు రాకుండా పరిష్కరించాలన్నారు. అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే నిమిత్తం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వివరాలను డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను చేపట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసే బాధ్యత ఆయా డీడీవోలదే అన్నారు.ఎన్నికల విధి నిర్వహణలో ఏ ఒక్కరికి మినహాయింపు ఉండదన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకు, సిబ్బందికి, త్వరలో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 162 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 143, ఆఫ్‌లైన్‌లో 19 స్వీకరించినట్లు తెలిపారు. స్పందనలో కలెక్టర్ కె. మాధవీలత, డీఆర్వో జి.నరసింహులు, టూరిజం డీఈ విస్వామినాయుడు, ట్రైనీ ఎస్‌బీసీ పి. సువర్ణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



కలెక్టరేట్ స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత



ఎమ్మెల్యేకు కార్మికుల విన్నపం

మా ఉద్యోగం.. మాకు ఇప్పించండి సార్..

కుటుంబీకులతో కలిసి గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికుల ఆవేదన

బిక్కవోలు, ఫిబ్రవరి 12 : మా ఉద్యోగం మాకివ్వండి సార్.. మీరు స్పందించకపోతే 250 కుటుంబాలు రోడ్డున పడతాయంటూ బలభద్రపురం శివారు కానేడులోని గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికులు వాపోయారు. కార్మికులందరూ సోమవారం తమ కుటుంబీకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమ లేఆఫ్‌ను ప్రకటించి మూడు నెలలుగా తమను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న 250 మంది కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు.ఫ్యాక్టరీ అక్రమంగా ప్రకటించిన లేఆఫ్‌ను ఎత్తివేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూర్తి, రామచంద్రరావు, కార్మిక సంఘ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు, నేతలు వి. రాంబాబు, కె. వెంకటరమణ, కుటుంబీకులతో కార్మికులు ఉన్నారు.



చిన్నారుల సమస్యలు వింటున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

వృద్ధులకు అండగా మేమున్నాం..

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మీకు ఏదైనా సమస్య ఉంటే మాకు చెప్పండి..వెంటనే పరిష్కరిస్తాం..వృద్ధులకు అండగా మేమున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి చెప్పారు.గౌతమి జీవకారుణ్య సంఘం లోని వసతి సదుపాయాలను సోమవారం పరిశీలించి వృద్ధులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. క్రమబద్ధంగా ఆహారం తీసుకోవాలని, వేళకు మందులు వేసుకోవాలని సూచించారు. కేవీ స్టేట్‌హోంకు వెళ్లి పిల్లలతో మాట్లాడారు.క్రమశిక్షణతో బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలని హితబోధ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాల్సిందేనని ఆదేశించారు.అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రభుత్వ కూరగాయల దుకాణం

సీతానగరం,ఫిబ్రవరి 12 : ప్రకృతి వ్యవసాయం ద్వారా పురుగు మందుల అవశేషాలు లేని కూరలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు అన్నారు. వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతానగరం మండల పరిషత్ కార్యాలయం వద్ద సహజ సిద్ధంగా పండించిన వ్యవసాయోత్పత్తుల స్టాల్స్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎరువులు,పురుగుమందులు వాడకుండా ఆరోగ్యకరమైన వ్యవసాయోత్పత్తులు, ఆకుకూరలు ,కూరగాయలు విక్రయిస్తారన్నారు. స్టాల్‌ను ప్రతి వారం ప్రతి మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల రిసోర్స్ పర్సన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని కూనవరం,కాటవరం,సీతానగరం ,చినకొండేపూడి ,మునికూడలి తదితర గ్రామాల్లో సుమారు 5 ఎకరాలలో (కమ్యూనిటీ మేనేజ్‌డ్ నాచురల్ ఫామింగ్) సహజ సిద్ధ పంటలు వేశామన్నారు. అక్కడ పండిన పంటను ప్రతి వారం మండల పరిషత్ కార్యాలయం వద్ద విక్ర యిస్తామన్నారు.కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్‌లు, ఎస్ఎఫ్ఎల్-2 సుంకర శ్రీనివాస్, ఎస్.ప్రవీణ్‌కుమార్, డివిజన్ ఎంటీ వరలక్ష్మి, ఎ.భవాని, నాగదేవి తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటిస్‌పై నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 : డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ పేర్కొంది.ఈ మేరకు సోమవారం గోకవరం బస్టాండు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్, ఉండ్రాజవరం జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు.అప్రెంటీస్ వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌కు నిరసనగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన నిర్వహించినట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించి కేవలం 6 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరీ, శ్రీమణి, రవిబాబు, రమేష్‌బాబు, రూపస్‌రావు, అనిత, ఉండ్రాజవరం మండల ప్రధాన కార్యదర్శి బి.రామారావు, ఐ. రాంబాబు, నాయకు లు ఉదయభాస్కర్, ఆళ్ల సుబ్బారావు, పద్మావతి, మాధవి, వల్లి, సీతారత్నం పాల్గొన్నారు.

ఉత్తుత్తి రిజిస్ట్రేషన్లు!



వెలుగుబందలోని జగనన్న కాలనీ

ఎన్నికల వేళ గుర్తొచ్చిందా!

ఎన్నికల వేళ వైసీపీ ప్రభుత్వం ఏ అవకాశాన్ని వదులుకోవడంలేదు.. ఏదో ఒక విధంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది.. గత ఐదేళ్లుగా గుర్తుకురాని ప్రజాప్రయోజన కార్యక్రమాలను హడావుడిగా చేస్తోంది..ఈ హడావుడిలోనే పట్టాల రిజిస్ట్రేషన్లకు తెరలేపింది.. సచివాలయాల్లో పేదలను గంటల తరబడి కూర్చోబెట్టి.. కాసేపు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి మీ రిజిస్ట్రేషన్ పూర్తయింది వెళ్లమని చెబుతున్నారు.. ఇది చూసి పేదలు తెల్లముఖం వేస్తున్నారు.. రిజిస్ట్రేషన్ అంటే కాగితాలు ఇవ్వాలి కదా.. వచ్చి వెళ్లిపొమ్మంటున్నారేమిటని కంగారుపడుతున్నారు. ఎందుకీ ఉత్తుత్తి రిజిస్ట్రేషన్లు అంటూ మండిపడుతున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- స్టాంపులు లేవు.. కాగితం ఇవ్వరు..
- పదేళ్ల తర్వాతే డాక్యుమెంట్?
- జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ తీరిది
- గందరగోళంగా మారిన వైనం
- తప్పులు సరిదిద్దే ఆప్షన్ లేక ఇక్కట్లు
- 66,523 పట్టాల రిజిస్ట్రేషన్ లక్ష్యం
- 26,632 మాత్రమే పూర్తి
- ఆవ భూముల్లో రిజిస్ట్రేషన్లు నిల్
- సర్వర్ పనిచేయక గగ్గోలు
- ఉదయం వెళితే రాత్రికే వచ్చేది

పేదలందరికీ ఇళ్లు - నవరత్నాల పేరుతో జగనన్న కాలనీల పేరిట ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తామని గొప్పగా ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం ఆచరణలో ఫలితాలు చూపలేకపోయింది. ఇప్పటికే ప్రకటించిన మేరకు పట్టాలివ్వలేదు.ఇచ్చిన మేర ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అయితే ఎన్నికల వేళ ఇచ్చిన పట్టాలను పదేళ్ల తర్వాత అమ్మేసుకోవడానికి వీలుగా ఉత్తుత్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆరంభించారు. సచివాలయ ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ అధికారాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. కానీ రిజిస్ట్రేషన్లు పూర్తయిన వాటి డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. ఎప్పుడిస్తారో కూడా చెప్పడంలేదు. లబ్ధిదారులను పిలిచి మమ అనిపిస్తున్నారు. అధికార వర్గాల్లో నలుగుతున్న సమాచారం ప్రకారం పదేళ్ల తర్వాతే ఈ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇస్తారని, అప్పటి వరకూ వీఆర్వోల వద్దనే ఉంటాయనే ప్రచారం ఉంది. ఇది లబ్ధిదారుల్లో తీవ్ర గందరగోళం సృష్టిస్తోంది.

26,632 పట్టాలకే రిజిస్ట్రేషన్..

జిల్లాలో సుమారు లక్షా 40 వేల మందికి ఇళ్లు ఇస్తామని ప్రకటించారు.కానీ ఇప్పటి వరకూ జిల్లాలో 66,523 మందికి పట్టాలు ఇచ్చారు.అందులో కొందరికి పట్టాలు చూపలేదు. గోపాలపురంలో లబ్ధిదారులు తిరస్కరించిన భూమిలో ఇచ్చిన పట్టాలకే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత నెల 29 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల 29, 30, 31 రిజిస్ట్రేషన్లు కాలేదు. ఈ నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. 19వ తేదీకి పూర్తి చేయాలని చెప్పినట్టు సమాచారం. ఈ లోపు ఎన్నికల షెడ్యూల్ వస్తే ఎటువంటి సమస్యలు ఎదురవుతాయోననే భయం ఉంది. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కూడా రిజిస్ట్రేషన్లు లేవు.జిల్లాలో ఇప్పటి వరకూ 26,632 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 40,788 పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ 24,820 పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేశారు.కొవ్వూరు డివిజన్‌లో 25,735 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ 1812 పట్టాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు.రాజమహేంద్రవరం అర్బన్ పేదలకు సుమారు 60 వేల పట్టాల వరకూ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇవాళ సుమారు 7 వేల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లాలో కేవలం 22 వేల ఇళ్ల వరకూ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఇక ఆవభూమికి ప్రత్యామ్నాయం చూపడంలేదు. పట్టాలకు రిజిస్ట్రేషన్లు లేవు.ప్రస్తుతం సర్వర్ సమస్య, ఇతర టెక్నికల్ సమస్యల వల్ల బాగా ఆలస్యం అవుతున్నాయి. ఒక్కో సచివాలయంలో రోజూ 30 చేయడం కూడా కష్టమవుతోంది.

తప్పులు సరిదిద్దే ఆప్షన్‌లేక..

ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కానీ పట్టాలోని తప్పులను సరిదిద్దే ఆప్షన్‌లేక తప్పులతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పట్టాలో లబ్ధిదారు భర్తలేదా తండ్రి పేరు లేకపోతే కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్లు చేయడం లేదనే సమస్య ఎదురవుతోంది.గతంలో హడావుడిగా జగన్న బొమ్మలతో పట్టాలు పంపిణీ చేశారు.రాత్రీ పగలూ కూర్చుని లబ్ధిదారుల పేర్లు రాసేశారు. అందులో అనేక తప్పులు ఉన్నాయి.వాటిని సరిదిద్దకుండా రిజిస్ట్రేషన్ చేయడం వల్ల పదేళ్ల తర్వాత అమ్ముకోవాలనుకుంటే ఎటువంటి సమస్యలు ఎదురవుతాయో.. అప్పటి పరిస్థి తులు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం వద్దే డాక్యుమెంట్లు?

రిజిస్ట్రేషన్ చేస్తున్న పట్టాలకు సంబంధించి డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. డాక్యుమెంట్‌లో లబ్ధిదారు ఫొటోతో పాటు, వీఆర్వో, సెక్రటరీల ఫొటోలు కూడా ఉండడం గమనార్హం.ఈ డాక్యుమెంట్లన్నీ అధికారుల వద్దే ఉండిపోతున్నాయి. ఇంత వరకూ ఎవరికీ ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో కూడా చెప్పడంలేదు. తమకు సమాచారం ఇంకా రాలేదని కొందరు అధికారులు చెబుతున్నారు.కానీ ప్రస్తుతం ఉన్న పట్టా మాత్రమే లబ్ధిదారుడి వద్ద ఉంటుందని రిజిస్టర్ డాక్యుమెంట్ మాత్రం లబ్ధిదారుడికి పదేళ్ల వరకూ ఇవ్వరనే ప్రచారం జరుగుతోంది. అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.ప్రస్తుతం లబ్ధిదారులకు అంతా గందరగోళంగా మారింది. పైగా కొందరి ఇళ్ల స్థలాలు చూపకుండానే పట్టాలు రిజిస్ట్రేషను జరిపిస్తున్నట్టు సమాచారం.



రండి.. కూర్చోండి : కొవ్వూరు, కడియం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు హాజరైన లబ్ధిదారుల

సర్వర్ కష్టాలు..

కొవ్వూరు/కడియం,ఫిబ్రవరి 12 : జగనన్నకాలనీ లబ్ధిదారుల ఇంటి రిజిస్ట్రేషన్లలో ఇటు లబ్ధిదారులు, మరో వైపు సచివాలయ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్లు చేపట్టినప్పటికి సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయక లబ్ధిదారులు, సచివాలయ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్థరాత్రి 11, 12 గంటల వరకు రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు. ఒక సచివాలయం పరిధిలో 400 మంది ఇళ్ల లబ్ధిదారులు ఉండగా గత నాలుగు రోజులుగా కేవలం 130 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. కడియం మండలానికి సంబంధించి జేగురుపాడు పరిధిలో పాములమెట్ట, వేమగిరిలోను ఇళ్ళస్థలాల పంపిణీ జరిగింది. 3,700 మందికి ఇళ్ళస్థలాలు ఇవ్వగా ఇప్పటి వరకు 600 మంది ఇళ్లు నిర్మించుకున్నారు.ఇప్పటి వరకు సుమారు 1,400 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు సబ్‌రిజిస్ట్రార్ ఆర్‌వీ రామారావు తెలిపారు. రోజువారి కార్యక్రమాలతో పాటు బీఎల్‌వో డ్యూటీలు, మరో ప్రక్క రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలతో సచివాలయ కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వర్ సమస్యను సరిదిద్దాలని ప్రజలు, సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.



టీడీపీ అభిమాని అని..

పింఛన్ బదిలీ

అనపర్తి, ఫిబ్రవరి 12 : టీడీపీ సానుభూతిపరుడి పింఛన్‌ను వైసీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లాకు బదిలీ చేసేశారు. దీంతో వృద్ధుడు గగ్గోలు పెడుతూ సోమవారం కలెక్టర్ ఆశ్రయించాడు. అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన వృద్ధాప్య పెన్షన్‌దారుడు గొలుగూరి సుబ్బారెడ్డి టీడీపీ సానుభూతి పరుడు.. దీంతో సుబ్బారెడ్డిని వైసీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు.ఇటీవల మూడు నెలలు పింఛన్ నిలుపుదల చేయడంతో టీడీపీ పోరాటం చేయగా ఒక్క నెల పింఛను ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అనంతరం ఆయన పెన్షన్‌ను కాకినాడ గండేపల్లి మండలానికి బదిలీ చేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడి సోమవారం ఇదెక్కడి న్యాయ మని వెంటనే పింఛను పునరుద్ధరించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. అనపర్తి నియోజకవర్గంలో పలువురు అధికారులు అధికారపార్టీకి అనుకూ లంగా వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పందనలో రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వేదికపై ఆశీనులైన అగస్త్యేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరి అమ్మవారు

వైభవంగా అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 : ధవళేశ్వరంలో పురాణ ప్రసిద్ధిగాంచిన బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలకరించి గ్రామంలో ఊరేగించారు. సోమవారం ఉదయం ధ్వజారోహణం, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరస్వామి పూజతో ప్రారంభమై స్వామి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామి అమ్మవార్లను ఊరేగించి అనంతరం ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ, చిన్న శర్మల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు కావించారు. శుక్రవారం త్రిశూల స్నానం, శనివారం పవళింపు సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కల్యాణోత్సవాలు పురస్కరించుకుని పూలమాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

జారి..పోతున్నారు..!

ప్రమాదకరంగా మారిన ఇసుక





సీతానగరం/ కొవ్వూరు, ఫిబ్రవరి 12 : తూర్పుగోదావరి జిల్లా ఇసుకకు పెట్టింది పేరు.. జిల్లా ఇసుక ఎక్కడెక్కడికో తరలిపోతోంది.. అదే ఇప్పుడు ప్రజల ప్రాణాల మీదకు తెస్తుంది.. జిల్లా వ్యాప్తంగా అన్ని ఇసుక ర్యాంపుల్లో నిబంధనలను అతిక్రమించి ఇసుక రవాణా చేస్తున్నారు. దానిలో భాగంగా లారీలపై కనీసం బరకం కప్పకుండా అధికంగా టన్నుల కొద్దీ ఇసుక రవాణా సాగుతోంది. గోదావరి వంతెనల చెంతనే అక్రమంగా డ్రెడ్జింగ్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా కనీసం కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. రాజమహేంద్రవరం, సీతానగరం రాష్ట్ర రహదారిలో నాలుగున్నరేళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఏదో అంతంతమాత్రంగా రోడ్డు పడిందనుకుంటే ఇసుక లారీలతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి లారీలో ఇసుక లోడింగ్ చేస్తుండడంతో రోడ్డుపై పెద్ద ఎత్తున పడిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు వేగంగా వచ్చి.. ప్రమాదాన్ని గుర్తించలేక రోడ్లపై జారి పడిపోతున్నారు. సిమెంట్ రోడ్ల కారణంగా బలమైన గాయాలు అవుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరి మాత విగ్రహం వరకు, రాజమహేంద్రవరంలోని పలు రోడ్లలో ప్రతి రోజు లారీలలో ఇసుక జారి రోడ్లపై పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇసుక కాంట్రాక్టర్లను అడగలేని అధికారులు కనీసం రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

షో..శాండ్ : ఇసుకతో నిండిన సీతానగరం-రాజమహేంద్రవరం రోడ్డు, కొవ్వూరు లాంచీలరేవు వద్ద రోడ్డుపై ఇసుక



కల్యాణోత్సవానికి రాట ముహూర్తం నిర్వహిస్తున్న అర్చకులు

భీమేశ్వరస్వామివారి కల్యాణ ఏర్పాట్లకు రాట ముహూర్తం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు సోమవారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 20 నుంచి 26 వరకు జరుగనున్నాయి. దక్షిణ గోపురం వద్ద సోమవారం ఉదయం 8.39 గంటలకు అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, హోమందార్లు వేదమంత్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ చేతుల మీదుగా రాటముహూర్తం చేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి 12: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో వార్షికంగా నిర్వహించే సప్తనదీ జలాభిషేకం, లక్ష కలముల వితరణ మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పము, సప్తనదీజల మండపారాధన, మహాన్యాసం, సప్తనదీ జలాభిషేకాలు, అభిషేకాలు, లక్ష దుర్వార్చన, లక్ష్మీగణపతి అష్ట ద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం జరుగుతాయి. బుధవారం గణపతి పూజ, సరస్వతీ కల్పము, సరస్వతీ మండపారాధన, సరస్వతీ మండపారాధన, సరస్వతీ హోమం, కలాలను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహిస్తారు. గురువారం పూజలనంతరం ఈ పెన్నులను పంపిణీ చేస్తారు.



స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

స్వామివారి హుండీ ఆదాయం రూ.24,41,574

అంతర్వేది, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ప్రధాన హుండీ ఆదాయం రూ.23,77,401 రాగా అన్నదాన హుండీ నుంచి రూ.64,173 వచ్చింది. మొత్తం 38 రోజులకు రూ.24,41,574 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, ఈవో బి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, ఎంపీటీసీలకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయండి

రంగంపేట,ఫిబ్రవరి, 12 రంగంపేట మండలం కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను 2024- 25 విద్యా సంవత్సరానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేకుంటే తమ పిల్లలను ఏ స్కూల్‌కి పంపించకుండా చదువు మానిపించేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సర్పంచ్ గవరసాని లక్ష్మికి, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావులకు సోమవారం వినతిపత్రం అందించారు. దీంతో వారు ఈ విషయం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని పేరెంట్స్ కమిటీ సభ్యులకు తెలిపారు.

కసాయి తండ్రి!

- పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తండ్రి
- భార్యపై కోపమే కారణం
- భార్య ఫిర్యాదుతో భర్తపై హత్యాయత్నం కేసు
- ఇద్దరు చిన్నారుల పరిస్థితి ఆందోళనకరం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య గొడవలు పిల్లల ప్రాణాల మీదకు తెచ్చాయి. భార్యతో విభేదాల కారణంగా కన్నపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన తండ్రిపై హత్య కేసు నమోదు చేశారు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన గూడి సాయి కిరణ్‌కి ఎర్రవరానికి చెందిన దుర్గతో ఆరేళ్ల కిందట వివాహమైంది. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల కొడుకు సందీప్, ఏడాదిన్నర కూతురితో ఆమె అమ్మగారింటికి వెళ్లిపోయింది. గత నెల 21వ తేదీన అత్తగారింటికి వెళ్లిన సాయి గొడవపడి ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చేశాడు. ఏమైందో ఏమోగానీ ఆదివారం అతడి ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన స్థానికులు వెళ్లి చూశారు. ఆ ఇంట్లో అప్పటికే అతడు, పిల్లలు తీవ్రంగా కాలిన గాయాలతోపడి ఉండడం చూసి భయాందోళన చెందారు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయని సాయి చెప్పాడు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఉన్న పిల్లల తల్లి అక్కడి నుంచి నేరుగా కాకినాడ ఆస్పత్రికి చేరుకుంది. తనపై కోపంతో పిల్లలపై భర్త సాయి పెట్రోలు పోసి నిప్పంటించాడని సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ ఉమర్ తెలిపారు. పిల్లల ఇద్దరు 80 శాతం మేర కాలిపోవడంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని బంధువులు చెప్పారు. చిన్నారులు ఇద్దరూ ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. తండ్రి గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు.





విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో, ఇతర అధికారులు.. విద్యార్థులను పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం

52 మంది గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- 8 మందికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- కలుషిత ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పలువురు ప్రముఖుల పరామర్శ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అదివారపుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 52 మంది సోమవారం అస్వస్థతకు గురయ్యారు. అందులో 8 మందిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషిత ఆహారం తినడం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ గురుకుల పాఠశాలలో 450 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వారిలో కొంతమందికి ఆదివారం రాత్రి వాంతులు, రక్త విరోచనాలు అయ్యాయి. గురుకుల పాఠశాల ఆరోగ్య పర్యవేక్షకుడు విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించాడు. సోమవారం ఉదయం నాటికి అస్వస్థతకు గురైన వారి సంఖ్య 52కు చేరుకుంది. అందులో కొంత మందికి వాంతులతోపాటు రక్త విరోచనాలు అయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య అందుతున్న తీరును పరిశీలించారు.

పీహెచ్‌సీ వైద్య శిబిరం

పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సందీప్ నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మణికంఠలు గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులను పరీక్షించారు. ప్రాథమిక చికిత్స అందించారు. వాంతులు, రక్త విరోచనాలవుతున్న ఐదుగురితోపాటు మరో 8 మందిని అంబులెన్సులో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డాక్టర్ వీరభద్రుడు, పిల్లల వైద్యులు విద్యార్థులకు చికిత్స అందచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ సంజీవరావు, సంయుక్త కార్యదర్శి, ఇతర అధికారులు ఆసుపత్రిలో విద్యార్థులకు అందుతున్న చికిత్సను పరిశీలించారు. అందించిన చికిత్స వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి తీసుకున్న ఆహారం, అస్వస్థత ఎలా గురయ్యారని అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు. చికిత్స వివరాలు అడిగారు.

కలుషిత ఆహారమే కారణం

విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ కావడం వల్లే అస్వస్థతకు గురయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం స్థిరంగా ఉందని, మంగళవారం ఉదయం డిశ్చార్జి చేయవచ్చని తెలిపారు. రెండో శనివారం పేరెంట్స్‌డే కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులు తీసుకువచ్చిన మాంసాహారం భుజించారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా పూరి, మధ్యాహ్నం చికెన్ బిర్యానీ ఆహారంగా తీసుకున్నారు. ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తేల్చారు.





బకెట్‌తో ఓఆర్ఎస్ అందిస్తున్న దృశ్యం.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కమిటీ వేసి నిర్ధారించాలి..

రామచంద్రపురం, ఫిబ్రవరి 12: ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ అదృష్టవశాత్తు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని, ఘటనకు కారణమేమిటో కమిటీ వేసి నిర్ధారించాలని, బాధ్యులైన హాస్టల్ వార్డెన్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ విద్యార్థులను పరామర్శించారు. జనసేన, టీడీపీ, వైసీపీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం

అమలాపురంటౌన్, ఫిబ్రవరి12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం హైస్కూలు సెంటర్లో నిరసన తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ నమూనా ప్రతులను దహనం చేశారు. అప్రంటీస్ విధానాన్ని రద్దుచేస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. జిల్లా కార్యదర్శులు పి.మురుగేశ్వరరావు, పెన్నాడ శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బీఎన్ వెంకటేశ్వరరావు, సత్తార్, రేణుకాప్రసాద్, తోరం బాలాజీ, ఈశ్వరరావు, సత్యనారాయణ, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.





చేబ్రోలులో చోరీకి ప్రయత్నించిన దృశ్యం.. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

పట్టపగలు చోరీకి ప్రయత్నం.. దొంగకు దేహశుద్ధి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టపగలు చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి తిరగబడటానికి ప్రయత్నించడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని ఈబీసీ కాలనీ వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నివాసముంటున్న బొమ్మిడాల కామేశ్వరరావు తన ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఇంటి తాళాలు, తలుపులను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన పక్కింటి వారు పట్టుకోవడానికి ప్రయత్నించగా హరేరామ గుడి వరకూ పరారయ్యాడు. అక్కడ స్థానికులు పట్టుకోగా వారిపై తిరగబడ్డాడు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొల్లప్రోలు పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



భైరవపాలెం సమీపంలో నడి సముద్రంలో అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న బోటు

బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- నడి సముద్రంలో బుగ్గి
- సురక్షితంగా బయటపడ్డ 11 మంది జాలర్లు

ఉప్పాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 12: నడి సముద్రంలో బోటులో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఆయిల్ ట్యాంక్ పేలిన సంఘటనలో బోటు పూర్తిగా దగ్ధమైందని ఉప్పాడ మత్స్యకార నాయకుడు, గ్రామ సర్పంచ్ ఉమ్మిడి జాన్ తెలిపారు. సూరాడపేటకు చెందిన సూరాడ కృష్ణ ఇంజన్ బోటుపై అదే పేటకు చెందిన 11 మంది మత్స్యకారులు సోమవారం తెల్లవారుజామున నడిసముద్రంలోకి చేపల వేటకు బయలుదేరారు. ఉప్పాడ తీరం నుంచి సముద్రం భైరవపాలెం వైపునకు వేట చేస్తూ వెళ్లారు. మధ్యాహ్నం భోజనం తయారు చేసుకొనేందుకు బోటులోనే వంట చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే లీకై ఉన్న గ్యాస్ స్టౌ వెలిగించిన క్షణాల్లో పక్కనే బోటు డీజిల్ ట్యాంక్ అంటుకోవడం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బోటులో ఉన్న మత్స్యకారులు హాహాకారాలు చేస్తుండడాన్ని గుర్తించిన సహచర మత్స్యకారులు వారిని వేరే బోటులో ఎక్కించి రక్షించారని సర్పంచ్ జాన్ తెలిపారు. మత్స్యకారులంతా సురక్షితంగా బయటపడగా, ఈ ప్రమాదంలో వేటాడిన చేపలు, వలలు, బోటు పూర్తిగా కాలిపోవడంతో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



మోతుగూడెం, ఫిబ్రవరి 12: మల్లారం గ్రామంలో జీలుగకల్లు తీయడానికి చెట్టు ఎక్కిన వ్యక్తి కాలుజారి కిందపడడంతో మృతి చెందాడు. ఎం.రామసుందరం (30) ఆదివారం రాత్రి జీలుగకల్లు తీయడానికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో భార్య గురుహరి చెట్టు వద్దకు వెళ్లి చూసింది. కింద పడి ఉన్న భర్తను చూసి చుట్టుపక్కల వారిని అక్కడికి తీసుకెళ్లింది. వారు రామసుందరాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసును మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామసుందరంనకు ముగ్గురు ఆడపిల్లలు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు

అప్పులబాధ తాళలేక కుటుంబం ఆత్మహత్యాయత్నం

యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

యానాం, ఫిబ్రవరి 12: అప్పుల బాధ తాళలేక లేక యానాంలో ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన సెల్ఫీ వీడియో బయటకు రావడంతో స్థానికులు హుటాహుటిన ఇంటికి వెళ్లి వారిని యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసుతం యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది. స్థానిక దంగేటివారి వీధిలోని అద్దె ఇంట్లో నివశిస్తున్న దేగల సునీత తన ఇద్దరు కుమారులతో కలిసి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన భర్త శ్రీను కొత్తపేటకు చెందిన పోశారావు దగ్గర రూ.15 వేలు తీసుకున్న అప్పు కట్టినప్పటికీ వడ్డీ పేరుతో మళ్లీ కట్టాలని వేధించారన్నారు. అయితే రూ.30 వేలు కట్టినప్పటికి అనంతరం రూ.1.50 లక్షలకు కోర్టు నుంచి నోటీసు పంపడంతో ఒత్తిడి భరించలేక తాగుడుకు బానిసై తన భర్త మృతి చెందడం జరిగిందన్నారు. తన భర్త చనిపోయి నెల గడవకముందే అప్పు చెల్లించాలని పోశారావు ఒత్తిడి తేవడం తన కుమారులు శ్రీరాజు, తేజలను వేధించడంతో ఏమీచేయలేని నిస్సహాయస్థితితో ఉన్న తాము చనిపోవాలని నిర్ణయించుకుని సెల్ఫీ వీడియో తీసుకుని చీమల మందు తాగారు. ఈ వీడియో చూసిన కుటుంబసభ్యులు, స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్త బాలుని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న ఎంఈవోలు, ఎడ్యుకేర్ స్కూలు కరస్పాండెంట్ తదితరులు

ఎడ్యుకేర్ విద్యార్థుల ఔదార్యం

వైద్య అవసరాల కోసం బాలునికి రూ.10 లక్షల ఆర్థిక సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 12: నగరం ఎడ్యుకేర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 8వ తరగతి చదువుతున్న బళ్ల రామ్‌మోహన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాలుడిని వైద్యులకు చూపించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో పడ్డారు. ప్రతీ రెండు రోజులకు డయాలసిస్ చేస్తున్నప్పటికీ వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని, దానికి రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎడ్యుకేర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మురార్జీ సూచన మేరకు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు విరాళాలుగా రూ.10 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎంఈవోలు సీహెచ్ లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు బాలుని కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. సహ విద్యార్థిని ఆదుకోవడానికి ముందుకొచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంఈవోలు అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కె.మురార్జీ, డైరెక్టర్ కె.సత్యవాణి, ప్రిన్సిపాల్ భాస్కర శ్రీనులు పాల్గొన్నారు.



మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలకోసం నిరీక్షించిన దృశ్యం

వైద్యం కోసం బిడ్డతో బాలింత నిరీక్షణ

జనసైనికుల స్పందనతో కాకినాడ తరలింపు

మండపేట, ఫిబ్రవరి 12: మండపేట ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన గిరిజన మహిళ నాలుగు గంటలు వైద్యుల కోసం నిరీక్షించినా స్పందన లేదు. దీంతో జనసైనికులు బాలింతను బిడ్డను 108లో కాకినాడకు తరలించి ప్రాణాలను కాపాడారు. విశాఖ జిల్లా కాకరపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ మర్రికాంతమ్మ కుటుంబంతో పొట్టకూటి కోసం కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి వచ్చింది. ఆమె ఆదివారం తాపేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను వైద్యం కోసం బంధువులు కేశవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో సోమవారం మండపేట ఆసుపత్రికి బిడ్డతో బాలింత వచ్చింది. నాలుగు గంటలు నిరీక్షించినా అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో జనసైనికులు స్పందించి ఆమెను, బిడ్డను 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. జనసేన మను కృష్ణ, ఇప్పనపాడు ఉపసర్పంచ్ కుంచే దుర్గాప్రసాద్ మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



గోల్డ్ మెడల్‌తో నాగిరెడ్డి

వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు

ఎటపాక, ఫిబ్రవరి12: అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సొడి నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపియ్యారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 5వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో నాగిరెడ్డి షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్, జావలిన్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. దాంతో నాగిరెడ్డి వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఇతర దేశంలో జరగనున్న పోటీల్లో నాగిరెడ్డి పాల్గొననున్నారు. దీంతో నాగిరెడ్డిని విలీన మండలాల్లోని అనేక మంది ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేనలో 150 కుటుంబాలు చేరిక

ఎటపాక, ఫిబ్రవరి12 ఎటపాక మండలం కన్నాయిగూడెంలోని శ్రీరామ్ నగర్‌కాలనీలో సుమారు 150 కుటుంబాలు సోమవారం జనసేన పార్టీలో చేరాయి. ఆ పార్టీ మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారాసు గంగాధర్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారంతా తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జనసేన మండల అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, జనసేన సీనియర్ నాయకులు పయ్యావుల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు బండారి భద్రరావు, కొమ్ము మహేష్, కొమ్ము వినయ్, సూరిశెట్టి సురేష్, దేగల మరళి తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్‌సిటీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఫిబ్రవరి 12: శాటిలైట్ సిటీలోని జడ్పీ హైస్కూల్లో సోమవారం పిల్లి లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలులోని రాజేశ్వరీ రామకృష్ణన్ కంటి ఆస్పత్రి డాక్టర్లు సీహెచ్ నాగరాజు శేఖర్, సిబ్బంది సుమారు 500 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పిల్లి సతీష్, మామిడిశెట్టి శ్రీనివాసకుమార్, పిల్లి శ్రీనివాస్, షేక్ ఖాదర్‌బాషా, మామిడిశెట్టి ఉష, పిల్లి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాహుల్ మీనా

యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి

టాటా ఎలక్ట్రానిక్స్‌లో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

విలీన మండలాల నుంచి 135 మంది యువతుల ఎంపిక

ఎటపాక, ఫిబ్రవరి 12: గిరిజన నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తూ ఉద్యోగాలకే వన్నె తేవాలని ఏఎస్పీ రాహుల్ మీనా అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రేరణ కార్యక్రమం ద్వారా అనేక రకాల కోర్సులను ఉచితంగా ఏర్పాటుచేస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎటపాకలో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించిన టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల ఇంటర్వ్యూలకు విలీన మండలాల నుంచి మొత్తం 230 మంది యువతులు హాజరయ్యారు. ఇందులో 135 మంది యువతులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన యువతులను తమిళనాడు రాష్ట్రంలోని హొసూర్‌లోని టాటా ఐఫోన్ తయారీ కంపెనీకి ఉద్యోగాల నిమిత్తం పంపించనున్నారు. జీతం, అలవెన్స్‌లతో కలిపి నెలకు రూ.18 వేలు లభిస్తుందని చెప్పారు. ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యమూ ఉందన్నారు. సీఐ డి.రామారావు, చింతూరు సీఐ గజేంద్ర, కూనవరం, మోతుగూడెం ఎస్‌ఐలు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఐటీడీఏ స్పందనకు 52 అర్జీలు

రంపచోడవరం, ఫిబ్రవరి 12: సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సుమారు 52 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే చెప్పారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టరు ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి అర్జీలను స్వీకరించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, పనుకురాతిపాలెం-పైడిపుట్ట రోడ్డు పనులు ప్రారంభించాలని, ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా మంజూరైన భూములకు సదును చేయించాలని, వ్యవసాయ సాగుకు సబ్సిడీపై పవర్ టిల్లర్లు మంజూరు చేయాలని, బందకానివాడ రోడ్డు పనులకు శంకుస్థాపన చేపట్టాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రి, డీడీలు అబూసలాం, షరీఫ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, ఏపీడీ శ్రీనివాసరావు, డీఈవో మల్లేశ్వరరావు, డీఎల్‌పీవో రాఘవన్, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, వైద్యాధికారిణి ఇందిరా, ఈఈలు డేవిడ్‌రాజు, సుబ్బయ్య, ఎండీ యూసఫ్, రవి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'కష్టకాలంలో పార్టీకి పనిచేసిన వంతలకే టికెట్'

దేవీపట్నం, ఫిబ్రవరి 12: రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ టికెట్ విషయంలో పార్టీ నిర్ణయమే శిరోధార్యమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ళ చంటిబాబు, రాష్ట్ర రైతు కార్యదర్శి మాగాపు బాబురావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణిలు పేర్కొన్నారు. సోమవారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, టిక్కెట్టు విషయంలో పార్టీలో కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఖండించారు. నియోజకవర్గంలో టీడీపీలో ఇంతవరకు ఇన్‌చార్జిగా వంతల రాజేశ్వరిపై కొంతమంది రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్న అసత్య ఆరోపణలు సత్యదూరమన్నారు. ప్రతిపక్షంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతూ వైసీపీ నిరంకుశ విధానాలను ఎండగడుతూ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. పార్టీ పరిశీలకులు పత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో జరిగిన పార్టీ విస్తృతస్థాయి మీటింగ్‌లోను, టికెట్ విషయంలో కార్యకర్తలతో చేపట్టిన అభిప్రాయ సేకరణలోను వంతలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని పలువురు జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో లంకా హరిశ్చంద్రుడు, పల్లపాటి నాగేశ్వరరావు, ముచ్చు త్రిమూర్తులు, ఏసు పాల్గొన్నారు.


పీవోకు వినతిపత్రం అందిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

'గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి'

రంపచోడరం, ఫిబ్రవరి12: ఏజెన్సీలో ఆదివాసీలు పండిస్తున్న వరి, మొక్కజొన్న, జొన్న తిండి గింజలతోపాటు పప్పు దినుసులు, జీడిమామిడి పిక్కలకు ప్రభుత్వం గిట్టుబాటు రేట్లు నిర్ణయించి కొనుగోలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కె.బాలురెడ్డి, ఐ.వి.రమణ, మడి ప్రసాద్‌దొర, ఆర్.నూకారెడ్డి, సీహెచ్.మాధవరెడ్డి, వలల కోమటిరెడ్డి, బి.మంగిరెడ్డి, మడకం గోవింద్, కుండ్ల కృష్ణారెడ్డి, పి.అనసూయ, సర్పంచ్ పి.ఆదిలక్ష్మి, డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

'ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించాలి'

మోతుగూడెం, ఫిబ్రవరి12: దబ్బగూడెం గ్రామానికి ఉపాధి హామీ పనిని ప్రారంభించి గ్రామంలోని కూలీలకు ఉపాధి చూపించాలని సీపీఎం నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం సున్నం దూలయ్య అధ్యక్షతన దంపగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ధోబి లక్ష్మణ్, తెల్లం చిన్నయ్య కట్టం బజార్, జల్లి లక్ష్మయ్య. దూబి సుబ్బయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు


బొమ్మూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

» జయహో బీసీ సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 12: అబద్ధపు హామీలు, కల్లబొల్లి కథలు చెప్పి అధికారంలోకి వచ్చాకా జగన్‌రెడ్డి బీసీలను వెన్ను పోటు పొడిచారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మండిపడ్డారు. బొమ్మూరులోని నరశింహరాజు కల్యాణ మండపంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో సగ భాగమైన బీసీలను ఏనాడూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మొదటి నుంచి బీసీలకు టీడీపీ అండగా ఉందని, పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి వారికి సమాజంలో గౌరవాన్ని కల్పించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకా 300 మంది బీసీలను పొట్టనపెట్టుకుందని, వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా జైలుకు పంపించారన్నారు. కార్యక్రమంలో మత్యేటి శివసత్య ప్రసాద్, చెల్లుబోయిన శ్రీను, మార్గాని సత్యనారాయణ, నూర్ భాషా, షేక్ సుభాన్, మేడిశెట్టి శ్రీను వెలుగుబంటి నాని, పందూరి అప్పారావు, పిన్నింటి ఏకబాబు పాల్గొన్నారు.

టీడీపీ గెలిచే స్థానాల్లో రాజానగరం మొదటిది : బీవీఆర్

కోరుకొండ, ఫిబ్రవరి 12: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని జిల్లాలో అత్యధిక మెజార్టీతో టీడీపీ గెలిచే స్థానాల్లో రాజానగరం మొదటి స్థానంలో ఉంటుందని పార్టీ నియోజకవర్గ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిపై నెలకొన్న పరిస్థితులను అందరూ గమనించాలన్నారు. జనవరి 26న రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించినప్పటికీ దానిపై ఇంత వరకు టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి ఎటువంటి సమాచారం లేదన్నారు. రానున్న రోజుల్లో వారిద్దరూ కలిసి చర్చించి ప్రకటించే వరకు టీడీపీ క్యాడర్ క్రమశిక్షణతో ఉండాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే పని చేయబోమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తమ అజెండా అన్నారు. సమావేశంలో తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశరావు, గంగిశెట్టి సత్తిబాబు, తోటకూర నాగేశ్వరరావు, అడపా వీరబాబు పాల్గొన్నారు.


కోరుకొండలో మాట్లాడుతున్న బీవీఆర్ చౌదరి

ఎన్నికల విధుల నుంచి ఎస్‌ఐను తొలగించండి


కలెక్టర్ మాధవీలతకు ఫిర్యాదు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

» జిల్లా కలెక్టర్‌కు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు

రంగంపేట, ఫిబ్రవరి 12: రాబోయే 2024 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తిస్తున్న రంగంపేట ఎస్‌ఐను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను కోరారు. అలాగే అనపర్తి నియోజకవర్గంలో అతి సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా చర్యలు ఏర్పాట్లు తీసుకోవాలని కోరారు. ఈ మూడు విషయాలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, వెంకటరామారెడ్డి, దేవదానబాబు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ప్రాంగణంలో వైసీపీ జెండా దిమ్మను తొలగించండి

రాజానగరం, ఫిబ్రవరి 12: కొత్తతుంగపాడు గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఇటీవల వైసీపీ నాయకులు నిర్మించిన పార్టీ జెండా దిమ్మను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ప్రెసిడెంట్ యాళ్ల మాచరయ్య ఎంపీడీవో కనకరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాచరయ్య మాట్లాడుతూ సచివాలయ ప్రాంగణంలో పార్టీ జెండా దిమ్మ నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శికి ఇప్పటికే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే పార్టీ జెండా దిమ్మను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సేవే పరమావధిగా కార్యక్రమాలు

వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో ఆదిరెడ్డి వాసు


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 12: పేదల ఆరోగ్యమే ధ్యేయంగా భవానీ చారిటబుల్ ట్రస్ట్, వాసవిశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక నారాయణపురం, వాంబే కాలనీల్లో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుతోపాటు కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను వైద్యపరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, కుడుపూడి సత్తిబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య మాలే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో మంత్రి వేణు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు అదనంగా మరో ట్యాంక్‌ను నిర్మించాల్సి ఉందని దీని కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అధికారులు, నాయకులతో కలిసి ఎర్రకొండ ప్రాంతంలో పర్యటించారు. మెరుగైన పారిశుధ్యంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా అధికారులకు సూచనలు చేశారు.

నీటి ఎద్దడిని నివారణకు చర్యలు చేపట్టాలి

రంగంపేట మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీదేవి

రంగంపేట, ఫిబ్రవరి 12: రాబోయే వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో నీటికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే విద్యుత్ ఓవర్‌లోడ్ వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయని, ముందుగానే ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చి రైతులకు 9గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. కె.కోటపాడులోని ఎంపీపీ పాఠశాలకు రెండు ఆట స్థలాలున్నాయని, వాటిలో ఒకటి అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలని ఎంపీటీసీ సుంకర అప్పారావు కోరారు. అలాగే అక్కడున్న ప్రాథమికోన్నత పాఠశాలను జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారని సభ దృష్టికి తీసుకు రాగా ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని ఎంపీపీ చెప్పారు. సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పాలాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, డీటీ ఎన్.దొరకయ్య ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు, పలువురు ధికారులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం పునరుద్ధరణపై నిరసన


జీవో కాపీలు దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోరుకొండ, ఫిబ్రవరి 12: సుదీర్ఘ పోరాటాలు అనంతరం ఉపాధ్యాయులు రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టినందుకు సోమవారం సాయంత్రం కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలియజేసి డీఎస్సీ నోటిఫికేషన్-2024 ప్రతులను దహనం చేశారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన వారికి అప్రెంటీస్ విధానం లేకుండా చేయడం మనం సాధించుకున్న విజయమని, దానిని వైసీపీ ప్రభుత్వం 2024 నోటిఫికేషన్‌లో తీసుకురావడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.శివబాబు, రాజేష్, శ్రీనివాస్, చక్రవర్తి పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



కోరుకొండ, ఫిబ్రవరి 12: మండలంలోని జంబుపట్నంలో శ్రీ ఉమా సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయార్చకులు, ఆగమ పండితులు గణపతి పూజ, రక్షాబంధన ధారణ, గోపూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, మండపారాధన, అగ్నిమదన హోమాలు, విశ్వేశ్వరస్వామి, మహాగణపతి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అభయాంజనేయస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ విమాన గోపురం శిఖరాలకు, నూతన విగ్రహాలకు, యంత్రాలకు జలాధివాసం, క్షీరాధివాసం, చతుర్వేద స్వస్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో 18 మంది దంపతులు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వుల్లి బుజ్జిబాబు, జంబుపట్నం సర్పంచ్ వుల్లి అప్పన్నదొర, నాగా సత్తిబాబు, నాగా రమేష్,వుల్లి శేషగిరి, వుల్లి చల్లారావు, వుల్లి పట్టాభిరామయ్య నాగా భాస్కరరావు పాల్గొన్నారు.

మహాశివరాత్రి భక్తులకు ఏర్పాట్లు చేయాలి

గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి



కమిషనర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12: మహాశివరాత్రి సందర్భంగా గోదావరి నదిలో స్నానమాచరించే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు, ఇతర స్నానఘట్టాలను పరిశీలించారు. గోదావరి నదీ స్నానాల రేవుల్లో మెట్లపై ఉన్న మట్టిని తొలగించాలని, మెట్ల నుంచి నది నీటి వరకూ సిమెంట్ ప్లాట్‌ఫారాలు నిర్మించాలన్నారు. వీటన్నింటిపై సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పల్లీల సంఘం, బ్రాహ్మణ సంఘం సభ్యులు, పారిశుధ్య సిబ్బంది, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బీవీఆర్ పరామర్శ

రాజానగరం, ఫిబ్రవరి 12: మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం పరామర్శించారు. మండలంలో చక్రద్వారబంధంలోని మామిడి ముసలయ్య, కానవరంలో వీరాతి శ్రీను, సంగిశెట్టి రామచంద్రరావు, కొండగుంటూరులో పొడుగు బాలాజీ శ్రీనివాస్, పెమ్మనబోయిన విఘ్నేశ్వరుడు, యార్లగడ్డ వీరగణి కుటుంబాలను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, బత్తుల త్రిమూర్తులు, సోడసాని రామారావు, సోడసాని త్రిమూర్తులు, మాదబోయిన వెంకటరమణ, సంగిత సత్యనారాయణ, అడపా వీరబాబు, పెమ్మనబోయిన వెంకటేష్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించిన పిల్లల పండుగ బాలోత్సవంలో ధవళేశ్వరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కూచిపూడి నృత్యం సీనియర్ విభాగంలో జి.ముత్యశ్రీకరి, జూనియర్ విభాగంలో కర్రి దుర్గ అక్షయ బహుమతులు సాధించారు. జిల్లా బాలికోన్నతపాఠశాల విద్యార్థులు ఈశ్వరి సుగుణాదేవి ప్రదర్శించిన కూచిపూడి నిత్యం అందరినీ అలరించింది. 9వ తరగతి విద్యార్థులు బృందం ప్రదర్శించిన జానపద నృత్యానికి బహుమతులు లభించాయి.



సౌత్‌జోన్ డీఎస్పీగా అంబికా ప్రసాద్


ఎస్పీ జగదీశ్‌కు మొక్క అందిస్తున్న డీఎస్పీ ప్రసాద్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సౌత్‌జోన్ డీఎస్పీగా నియమితులైన ఎం.అంబికా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. జోన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సౌత్‌జోన్ డీఎస్పీని కలిసిన కడియం సీఐ

కడియం, ఫిబ్రవరి 12: సౌత్‌జోన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.అంబికాప్రసాద్‌ను రాజమహేంద్రవరంలో సోమవారం కడియం సీఐ బి.తులసీధర్ కలిసారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం, ఫిబ్రవరి 12: జేగురుపాడులోని ది పేతురు మోమోరియల్ ప్రార్థనా మందిరంలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. పాస్టర్ కె.శ్యామ్‌కుమార్ దేవుని వాక్య సందేశం అందించారు. సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి, ఎం.కరుణాకర్, కె.జయశీల్, రత్నదీప్, డి.రతన్‌రాజు, సోలోమాన్ పాల్గొన్నారు.

సువర్ణవేణికి విద్యారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సువర్ణవేణి

కడియం, ఫిబ్రవరి 12: కడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బూసి సువర్ణవేణికి విద్యారత్న నేషనల్ అవార్డు-2024 లభించింది. తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయాధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు హెచ్ఎం సత్యనారాయణ, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వేమగిరిలో వైద్యశిబిరం

కడియం, ఫిబ్రవరి 12: వేమగిరిలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, ఈలి గోపాలం, నరాల మోహన్, మెల్లిమి భాస్కరరావు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెం శోకసంద్రం

విద్యార్థుల మృతదేహాలకు అంత్యక్రియలు


రంపయర్రంపాలెంలో అంత్య క్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం, ఫిబ్రవరి 12: రంపయర్రంపాలెం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆదివారం రంపచోడవరం పరిధిలోని సీతపల్లి వాగులో పడి మృతి చెందిన కాకర వీరవెంకట అర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రామన్‌జీ మృతదేహాలు పోస్టుమార్టం అనంతరం సోమవారం రంపయర్రంపాలెం చేరుకున్నాయి. మృతులను కడసారిగా చూసేందుకు గ్రామస్థులంతా వచ్చారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన ముగ్గురి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు రంపయర్రంపాలెం చేరుకొని విద్యార్థుల పార్థివదేహాలను సందర్శించారు. అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర సాగింది. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ఇద్దరి అదృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వేర్వేరుగా అదృశ్యం కావడంపై కేసులు నమోదయ్యాయి. దానవాయిపేటకు చెందిన బర్ల శివశంకర ప్రసాద్ బిర్యానీ పొట్లం పేరుతో బిర్యానీ విక్రయ కేంద్రాలు నిర్వహి స్తుంటాడు. అతడు ఇంటి నుంచి సోమవారం ఉదయం బయటికి వచ్చి తిరిగి రాలేదని అన్నయ్య రమేశ్ ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గోకవరం మండలానికి చెందిన బి.శ్రీను ఈ నెల 9న కోర్టు పనుందని రాజమహేంద్రవరం వచ్చాడు. మళ్లీ ఇంటికి చేరుకోలేదని కొడుకు సదాశివం ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాటిలైట్ సిటీలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఫిబ్రవరి 12: శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పిల్లి లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ కంటి ఆస్పత్రి డాక్టర్లు సీహెచ్.నాగరాజు శేఖర్, సిబ్బంది సుమారు 500 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో పిల్లి సతీష్, కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాసకుమార్, కోశాధికారి పిల్లి శ్రీనివాస్, సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, మామిడిశెట్టి ఉష, పిల్లి కుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను పరిష్కరించండి : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 : ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వా లని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత అ న్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఏ ఒక్క అర్జీదారుడు మళ్లీ అదే సమస్యపై స్పందనకు రాకుండా పరిష్కరించాలన్నారు. అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్ని కల్లో విధులు నిర్వహించే నిమిత్తం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వివరాలను డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను చేపట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసే బాధ్యత ఆయా డీడీవోలదే అన్నారు.ఎన్నికల విధి నిర్వహణలో ఏ ఒక్కరికి మినహాయింపు ఉండదన్నారు. పోలింగ్ విదులు నిర్వహించే పోలింగ్ అధికారులకు, సిబ్బందికి, త్వరలో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 162 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో 143, ఆఫ్‌లైన్‌లో 19 స్వీకరించినట్టు తెలిపారు. స్పందనలో కలెక్టర్ కె. మాధవీలత, డీఆర్వో జి.నరసింహులు, టూరిజం డీఈ విస్వామినాయుడు, ట్రైనీ ఎస్‌బీసీ పి. సువర్ణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



ఎస్పీ స్పందనకు 35 అర్జీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చట్టపరమైన సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. ఫిర్యాదుకు సంబంధించిన స్టేషను ఇన్‌స్పెక్టర్, డీఎస్పీలతో జూమ్ ద్వారా బాధితుల సమక్షంలోనే ఎస్పీ మాట్లాడి మరొకసారి అదే విధమైన సమస్య రాకుండా పరిష్కారం చేయాలని ఆదేశించారు.స్పందనకు వచ్చిన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీకి అందిన అర్జీల్లో ఈస్ట్ జోన్‌కి సంబంధించినవి 12, నార్త్ 9, సౌత్ 2, సెంట్రల్ జోన్‌కి చెందినవి 5, కొవ్వూరు సబ్‌డివిజన్ పరిధి నుంచి 6, దిశ 1 ఉన్నాయి.



ఎమ్మెల్యేకు కార్మికుల విన్నపం

మా ఉద్యోగం.. మాకు ఇప్పించండి సార్..

కుటుంబీకులతో కలిసి గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికుల ఆవేదన

బిక్కవోలు, ఫిబ్రవరి 12 : మా ఉద్యోగం మాకివ్వండి సార్.. మీరు స్పందించకపోతే 250 కుటుంబాలు రోడ్డున పడతాయంటూ బలభద్రపురం శివారు కానేడులోని గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికులు వాపోయారు. కార్మికులందరూ సోమవారం తమ కుటుంబీకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమ లేఆఫ్‌ను ప్రకటించి మూడు నెలలుగా తమను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న 250 మంది కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు.ఫ్యాక్టరీ అక్రమంగా ప్రకటించిన లేఆఫ్‌ను ఎత్తివేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూర్తి, రామచంద్రరావు, కార్మిక సంఘ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావు, నేతలు వి. రాంబాబు, కె. వెంకటరమణ, కుటుంబీకులతో కార్మికులు ఉన్నారు.



చిన్నారుల సమస్యలు వింటున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

వృద్ధులకు అండగా మేమున్నాం..

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మీకు ఏదైనా సమస్య ఉంటే మాకు చెప్పండి..వెంటనే పరిష్కరిస్తాం..వృద్ధులకు అండగా మేమున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి చెప్పారు.గౌతమి జీవకారుణ్య సంఘం లోని వసతి సదుపాయాలను సోమవారం పరిశీలించి వృద్ధులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. క్రమబద్ధంగా ఆహారం తీసుకో వాలని, వేళకు మందులు వేసుకోవాలని సూచించారు. కేవీ స్టేట్‌హోంకు వెళ్లి పిల్లలతో మాట్లాడారు.క్రమశిక్షణతో బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలని హితబోధ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాల్సిందేనని ఆదేశించారు.అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రభుత్వ కూరగాయల దుకాణం

సీతానగరం,ఫిబ్రవరి 12 : ప్రకృతి వ్యవసాయం ద్వారా పురుగు మందుల అవశేషాలు లేని కూరలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు అన్నారు. వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతానగరం మండల పరిషత్ కార్యాలయం వద్ద సహజ సిద్ధంగా పండించిన వ్యవసాయోత్పత్తుల స్టాల్స్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎరువులు,పురుగుమందులు వాడకుండా ఆరోగ్యకరమైన వ్యవసాయోత్పత్తులు, ఆకుకూరలు ,కూరగాయలు విక్రయిస్తారన్నారు. స్టాల్‌ను ప్రతి వారం ప్రతి మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల రిసోర్స్ పర్సన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని కూనవరం,కాటవరం,సీతానగరం ,చినకొండేపూడి ,మునికూడలి తదితర గ్రామాల్లో సుమారు 5 ఎకరాలలో (కమ్యూనిటీ మేనేజ్‌డ్ నాచురల్ ఫామింగ్) సహజ సిద్ధ పంటలు వేశామన్నారు. అక్కడ పండిన పంటను ప్రతి వారం మండల పరిషత్ కార్యాలయం వద్ద విక్ర యిస్తామన్నారు.కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్‌లు, ఎస్ఎఫ్ఎల్-2 సుంకర శ్రీనివాస్, ఎస్.ప్రవీణ్‌కుమార్, డివిజన్ ఎంటీ వరలక్ష్మి, ఎ.భవాని, నాగదేవి తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటిస్‌పై నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 : డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ పేర్కొంది.ఈ మేరకు సోమవారం గోకవరం బస్టాండు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్, ఉండ్రాజవరం జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు.అప్రంటీస్ వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌కు నిరసనగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన నిర్వహించినట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించి కేవలం 6 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరీ, శ్రీమణి, రవిబాబు, రమేష్‌బాబు, రూపస్‌రావు, అనిత, ఉండ్రాజవరం మండల ప్రధాన కార్యదర్శి బి.రామారావు, ఐ. రాంబాబు, నాయకు లు ఉదయభాస్కర్, ఆళ్ల సుబ్బారావు, పద్మావతి, మాధవి, వల్లి, సీతారత్నం పాల్గొన్నారు.

ఉత్తుత్తి రిజిస్ట్రేషన్లు!



వెలుగుబందలోని జగనన్న కాలనీ

ఎన్నికల వేళ గుర్తొచ్చిందా!

ఎన్నికల వేళ వైసీపీ ప్రభుత్వం ఏ అవకాశాన్ని వదులుకోవడంలేదు.. ఏదో ఒక విధంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది.. గత ఐదేళ్లుగా గుర్తుకురాని ప్రజాప్రయోజన కార్యక్రమాలను హడావుడిగా చేస్తోంది..ఈ హడావుడిలోనే పట్టాల రిజిస్ట్రేషన్లకు తెరలేపింది.. సచివాలయాల్లో పేదలను గంటల తరబడి కూర్చోబెట్టి.. కాసేపు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి మీ రిజిస్ట్రేషన్ పూర్తయింది వెళ్లమని చెబుతున్నారు.. ఇది చూసి పేదలు తెల్లముఖం వేస్తున్నారు.. రిజిస్ట్రేషన్ అంటే కాగితాలు ఇవ్వాలి కదా.. వచ్చి వెళ్లిపొమ్మంటున్నారేమిటని కంగారుపడుతున్నారు. ఎందుకీ ఉత్తుత్తి రిజిస్ట్రేషన్లు అంటూ మండిపడుతున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పేదలందరికీ ఇళ్లు - నవరత్నాల పేరుతో జగనన్న కాలనీల పేరిట ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తామని గొప్పగా ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం ఆచరణలో ఫలితాలు చూపలేకపోయింది. ఇప్పటికే ప్రకటించిన మేరకు పట్టా లివ్వలేదు.ఇచ్చిన మేర ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అయితే ఎన్నికల వేళ ఇచ్చిన పట్టాలను పదేళ్ల తర్వాత అమ్మేసుకోవడానికి వీలుగా ఉత్తుత్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆరంభించారు. సచివాలయ ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ అధికారాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. కానీ రిజిస్ట్రేషన్లు పూర్తయిన వాటి డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. ఎప్పుడిస్తారో కూడా చెప్పడంలేదు. లబ్ధిదారులను పిలిచి మమ అనిపిస్తున్నారు. అధికార వర్గాల్లో నలు గుతున్న సమాచారం ప్రకారం పదేళ్ల తర్వాతే ఈ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇస్తారని, అప్పటి వరకూ వీఆర్వోల వద్దనే ఉంటాయనే ప్రచారం ఉంది. ఇది లబ్ధిదారుల్లో తీవ్ర గందరగోళం సృష్టిస్తోంది.

26,632 పట్టాలకే రిజిస్ట్రేషన్..

జిల్లాలో సుమారు లక్షా 40 వేల మందికి ఇళ్లు ఇస్తామని ప్రకటించారు.కానీ ఇప్పటి వరకూ జిల్లాలో 66,523 మందికి పట్టాలు ఇచ్చారు.అందులో కొందరికి పట్టాలు చూపలేదు. గోపాలపురంలో లబ్ధిదారులు తిర స్కరించిన భూమిలో ఇచ్చిన పట్టాలకే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత నెల 29 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల 29, 30, 31 రిజిస్ట్రేషన్లు కాలేదు. ఈ నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. 19వ తేదీకి పూర్తి చేయాలని చెప్పినట్టు సమాచారం. ఈ లోపు ఎన్నికల షెడ్యూల్ వస్తే ఎటువంటి సమస్యలు ఎదురవుతాయోననే భయం ఉంది. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కూడా రిజిస్ట్రేషన్లు లేవు.జిల్లాలో ఇప్పటి వరకూ 26,632 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 40,788 పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ 24,820 పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేశారు.కొవ్వూరు డివిజన్‌లో 25,735 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ 1812 పట్టాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు.రాజమహేంద్రవరం అర్బన్ పేదలకు సుమారు 60 వేల పట్టాల వరకూ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇవాళ సుమారు 7 వేల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లాలో కేవలం 22 వేల ఇళ్ల వరకూ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఇక ఆవభూమికి ప్రత్యామ్నాయం చూపడంలేదు. పట్టాలకు రిజిస్ట్రేషన్లు లేవు.ప్రస్తుతం సర్వర్ సమస్య, ఇతర టెక్నికల్ సమస్యల వల్ల బాగా ఆలస్యం అవుతున్నాయి. ఒక్కో సచివాలయంలో రోజూ 30 చేయడం కూడా కష్టమవుతోంది.

తప్పులు సరిదిద్దే ఆప్షన్‌లేక..

ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కానీ పట్టాలోని తప్పులను సరిదిద్దే ఆప్షన్‌లేక తప్పులతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పట్టాలో లబ్ధిదారు భర్తలేదా తండ్రి పేరు లేకపోతే కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్లు చేయడం లేదనే సమస్య ఎదురవుతోంది.గతంలో హడావుడిగా జగన్న బొమ్మలతో పట్టాలు పంపిణీ చేశారు.రాత్రీ పగలూ కూర్చుని లబ్ధిదారుల పేర్లు రాసేశారు. అందులో అనేక తప్పులు ఉన్నాయి.వాటిని సరిదిద్దకుండా రిజిస్ట్రేషన్ చేయడం వల్ల పదేళ్ల తర్వాత అమ్ముకోవాలనుకుంటే ఎటువంటి సమస్యలు ఎదురవుతాయో.. అప్పటి పరిస్థి తులు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం వద్దే డాక్యుమెంట్లు?

రిజిస్ట్రేషన్ చేస్తున్న పట్టాలకు సంబంధించి డాక్యుమెంట్లను లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. డాక్యుమెంట్‌లో లబ్ధిదారు ఫొటోతో పాటు, వీఆర్వో, సెక్రటరీల ఫొటోలు కూడా ఉండడం గమనార్హం.ఈ డాక్యుమెంట్లన్నీ అధికారుల వద్దే ఉండిపోతున్నాయి. ఇంత వరకూ ఎవరికీ ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో కూడా చెప్పడంలేదు. తమకు సమాచారం ఇంకా రాలేదని కొందరు అధికారులు చెబుతున్నారు.కానీ ప్రస్తుతం ఉన్న పట్టా మాత్రమే లబ్ధిదారుడి వద్ద ఉంటుందని రిజిస్టర్ డాక్యుమెంట్ మాత్రం లబ్ధిదారుడికి పదేళ్ల వరకూ ఇవ్వరనే ప్రచారం జరుగుతోంది. అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.ప్రస్తుతం లబ్ధిదారులకు అంతా గందరగోళంగా మారింది. పైగా కొందరి ఇళ్ల స్థలాలు చూపకుండానే పట్టాలు రిజిస్ట్రేషను జరిపిస్తున్నట్టు సమాచారం.

- స్టాంపులు లేవు.. కాగితం ఇవ్వరు..
- పదేళ్ల తర్వాతే డాక్యుమెంట్?
- జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ తీరిది
- గందరగోళంగా మారిన వైనం
- తప్పులు సరిదిద్దే ఆప్షన్ లేక ఇక్కట్లు
- 66,523 పట్టాల రిజిస్ట్రేషన్ లక్ష్యం
- 26,632 మాత్రమే పూర్తి
- ఆవ భూముల్లో రిజిస్ట్రేషన్లు నిల్
- సర్వర్ పనిచేయక గగ్గోలు
- ఉదయం వెళితే రాత్రికే వచ్చేది



రండి.. కూర్చోండి : కొవ్వూరు, కడియం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు హాజరైన లబ్ధిదారుల

సర్వర్ కష్టాలు..

కొవ్వూరు/కడియం,ఫిబ్రవరి 12 : జగనన్నకాలనీ లబ్ధిదారుల ఇంటి రిజిస్ట్రేషన్లలో ఇటు లబ్ధిదారులు, మరో వైపు సచివాలయ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్లు చేపట్టినప్పటికి సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయక లబ్ధిదారులు, సచివాలయ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11, 12 గంటల వరకు రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు. ఒక సచివాలయం పరిధిలో 400 మంది ఇళ్ల లబ్ధిదారులు ఉండగా గత నాలుగు రోజులుగా కేవలం 130 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. కడియం మండలానికి సంబంధించి జేగురుపాడు పరిధిలో పాములమెట్ట, వేమగిరిలోను ఇళ్లస్థలాల పంపిణీ జరిగింది. 3,700 మందికి ఇళ్లస్థలాలు ఇవ్వగా ఇప్పటి వరకు 600 మంది ఇళ్లు నిర్మించుకున్నారు.ఇప్పటి వరకు సుమారు 1,400 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు సబ్‌రిజిస్ట్రార్ ఆర్‌వీ రామారావు తెలిపారు. రోజువారి కార్యక్రమాలతో పాటు బీఎల్‌వో డ్యూటీలు, మరో ప్రక్క రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలతో సచివాలయ కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వర్ సమస్యను సరిదిద్దాలని ప్రజలు, సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.



టీడీపీ అభిమాని అని..

పింఛన్ బదిలీ

అనపర్తి, ఫిబ్రవరి 12 : టీడీపీ సానుభూతిపరుడి పింఛన్‌ను వైసీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లాకు బదిలీ చేసేశారు. దీంతో వృద్ధుడు గగ్గోలు పెడుతూ సోమవారం కలెక్టర్ ఆశ్రయించాడు. అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన వృద్ధాప్య పెన్షన్‌దారుడు గొలుగూరి సుబ్బారెడ్డి టీడీపీ సానుభూతి పరుడు.. దీంతో సుబ్బారెడ్డిని వైసీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు.ఇటీవల మూడు నెలలు పింఛన్ నిలుపుదల చేయడంతో టీడీపీ పోరాటం చేయగా ఒక్క నెల పింఛను ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అనంతరం ఆయన పెన్షన్‌ను కాకినాడ గండేపల్లి మండలానికి బదిలీ చేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడి సోమవారం ఇదెక్కడి న్యాయ మని వెంటనే పింఛను పునరుద్ధరించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. అనపర్తి నియోజకవర్గంలో పలువురు అధికారులు అధికారపార్టీకి అనుకూ లంగా వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పందనలో రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వేదికపై ఆశీనులైన అగస్తేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరి అమ్మవారు

వైభవంగా అగస్తేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 : ధవళేశ్వరంలో పురాణ ప్రసిద్ధిగాంచిన బాలాత్రిపుర సుందరి సమేత అగస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలకరించి గ్రామంలో ఊరేగించారు. సోమవారం ఉదయం ధ్వజారోహణం, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరస్వామి పూజతో ప్రారంభమై స్వామి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామి అమ్మవార్లను ఊరేగించి అనంతరం ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ, చిన్న శర్మల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు కావించారు. శుక్రవారం త్రిశూల స్నానం, శనివారం పవళింపు సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కల్యాణోత్సవాలు పురస్కరించుకుని పూలమాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

జారి..పోతున్నారు..!

ప్రమాదకరంగా మారిన ఇసుక





షో..శాండ్ : ఇసుకతో నిండిన సీతానగరం-రాజమహేంద్రవరం రోడ్డు, కొవ్వూరు లాంచీలరేవు వద్ద రోడ్డుపై ఇసుక

సీతానగరం/ కొవ్వూరు, ఫిబ్రవరి 12 : తూర్పుగోదావరి జిల్లా ఇసుకకు పెట్టింది పేరు.. జిల్లా ఇసుక ఎక్కడెక్కడికో తరలిపోతోంది.. అదే ఇప్పుడు ప్రజల ప్రాణాల మీదకు తెస్తుంది.. జిల్లా వ్యాప్తంగా అన్ని ఇసుక ర్యాంపుల్లో నిబంధనలను అతిక్రమించి ఇసుక రవాణా చేస్తున్నారు. దానిలో భాగంగా లారీలపై కనీసం బరకం కప్పకుండా అధికంగా టన్నుల కొద్దీ ఇసుక రవాణా సాగుతోంది. గోదావరి వంతెనల చెంతనే అక్రమంగా డ్రెజ్జింగ్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా కనీసం కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. రాజమహేంద్రవరం, సీతానగరం రాష్ట్ర రహదారిలో నాలుగున్నరేళ్లగా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఏదో అంతంతమాత్రంగా రోడ్డు పడిందనుకుంటే ఇసుక లారీలతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి లారీలో ఇసుక లోడింగ్ చేస్తుండడంతో రోడ్డుపై పెద్ద ఎత్తున పడిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు వేగంగా వచ్చి.. ప్రమాదాన్ని గుర్తించలేక రోడ్లపై జారి పడిపోతున్నారు. సిమెంట్ రోడ్ల కారణంగా బలమైన గాయాలు అవుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరి మాత విగ్రహం వరకు, రాజమహేంద్రవరంలోని పలు రోడ్లలో ప్రతి రోజు లారీలలో ఇసుక జారి రోడ్లపై పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇసుక కాంట్రాక్టర్లను అడగలేని అధికారులు కనీసం రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

శతక పద్య సహస్ర గళార్చన-వేమన శతకం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 12: అమ్మ పాల వంటి కమ్మనైన భాష తెలుగుబాష అని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు చర్ల సుభాష్‌చంద్రబోసు అన్నారు. శతక పద్య సహస్ర గళార్చన-వేమన శతకం కార్యక్రమం కొవ్వూరులో సోమవారం నిర్వహించారు. స్థానిక పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో మాతృభాషా పరిరక్షణ సమితి నిర్వహణలో అపస్మా సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 1008 మంది చిన్నారులు, 108 వేమన పద్యాలు ఆలపించారు. సంస్థ సమన్వయకర్త సీహెచ్‌వీఎస్ నాగభూషణం మాట్లాడుతూ భావితరాలకు తెలుగుభాషా వైభవాన్ని చాటి చెప్పడంతో పాటు, చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు మాతృబాషా పరిరక్షణ సమితి పాటు పడుతోందన్నారు. పాఠశాలల వారీగా విద్యార్థులు 108 వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎన్ఎల్ రామారావు, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, దోర్బల ప్రభాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా ప్రతిష్ఠ వార్షికోత్సవాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 12: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ సుందర సాయినాథ్ విగ్రహ ప్రతిష్టా 29వ వార్షికోత్సవాలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు షిరిడి సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు గుడివాక శ్రీనివాస్ తెలిపారు. 13న కలశస్థాపన, సామూహిక శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం, మహాగణపతి యాగం, గణపతి హోమం, హనుమాన్‌చాలీసా పారాయణం, 14న ఏకాదశ రుద్రాభిషేకాలు, సంపూర్ణ భగవద్గీత పారాయణం, శ్రీరామసుగ్రీవ మైత్రిపై హరికథ, 15న తులసి, బిల్వార్చన, విష్ణు సహ్రనామా పారాయణం, సంకీర్తనలు జరుగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేత

దేవరపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని సంగాయిగూడెంలో ప్రాథమిక మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు సామాజిక సేవా విశ్లేషకుడు సుంకవల్లి సత్తిరాజు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యలో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో 'పల్లెకు పోదాం'



పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నిడదవోలు, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో వైసీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, అయితే ఎక్కడా కేంద్ర ప్రభుత్వం పేరును ఉపయోగించడం లేదని బీజేపీ మండలాధ్యక్షుడు మాట్ల వెంకట దుర్గారావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో సోమవారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్, ఆవాస యోజన, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో తోరం జయ శ్రీనివాస్, తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, దేవన వెంకట పాపారావు, చింతల బాలాజీ పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ.11.34 కోట్లు పంపిణీ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 12: ఉండ్రాజవరం మండలంలోని డ్వాక్రా సంఘాలకు రూ.11.34 కోట్లు చెక్కులు పంపిణీ చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పాలంగిలో వైఎస్ఆర్ ఆసరా పథకం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాల్లో మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, నాయకులు, అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

తపస్విరెడ్డికి కరాటేలో గోల్డ్‌మెడల్



నిడదవోలు, ఫిబ్రవరి 12: నిడదవోలుకు చెందిన ఆరో తరగతి విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ అండర్ 14 బ్లాక్ బెల్ట్ కేటగిరిలో కటా విభాగంలో బంగారు పతాకం, కుమితి విభాగంలో కాంస్య పతాకం గెలుచుకు న్నాడు. దీంతో నిడదవోలు పట్టణంలోని పలువురు క్రీడాకారులు పట్టణ ప్రముఖులు కుంచాల తపస్విరెడ్డిని అభినందించారు.

క్షేత్రస్థాయి పరిశీలన ప్రధానం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 12: విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సుల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రధానమని ఉండ్రాజవరం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం హైస్కూల్‌కు చెందిన 9, 10 తరగతుల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సులపై క్షేత్రస్థాయి ప్రదర్శనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు హెచ్ఎం చెప్పారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ల్యాబ్ పనితీరును వారికి చూపించి అవగాహన కల్పించినట్టు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యాన్ దగ్ధం

చాగల్లు, ఫిబ్రవరి 12 చాగల్లులో ప్రధాన రహదారిపై మీననగరం డిస్టలరీ సమీపంలో సోమవారం ఐషర్ వ్యాన్ దగ్ధమైంది. ద్రాక్షపళ్ల సరఫరా చేసే వ్యాన్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రమాదం సంభవించినట్టు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలోనే వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఉండడంతో కొవ్వూరు అగ్నిమాపక అధికారి వేణు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. నష్టం సుమారు రూ.4 లక్షలు వరకు ఉంటుందని యజమాని తోట శ్రీనివాస్ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

చాగల్లు, ఫిబ్రవరి 12: ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.నాగరాజు సోమవారం తెలిపారు. చాగల్లుకు చెందిన చింతపల్లి వెంకటేశ్వరరావు తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడని నెలటూరుకు చెందిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడికి ఇప్పటికే వివాహమైందని పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



దేవరపల్లి, ఫిబ్రవరి 12: చిన్నాయిగూడెంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన కొమారపు రవికుమార్(34)అతని తమ్ముడు అనిల్‌కుమార్ మధ్య ఇటీవల గొడవలు జరిగాయి.ఈ నెల 6న అనిల్‌కుమార్ కుర్చీతో కొట్టడంతో రవి కుమార్‌కు గాయాలై కుట్లు పడ్డాయి. తమ్ముడు గాయపరచడం వల్లే మృతి చెందాడని రవికుమార్ భార్య సుధా చెబుతోంది. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించగా మృతి చెందడానికి సంబంధించిన బలమైన గాయాలేవి కనిపించలేదని తెలిపారు.అయితే గొడవ జరిగినప్పటి నుంచి రవికుమార్ సరిగా భోజనం చేయకుండా మద్యం విపరీతంగా తాగుతున్నాడని, చనిపోయే ముందు కూడా రామందు తాగాడని స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని సోమవారం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

15న కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఫిబ్రవరి 12: కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్టు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణంలోని 23 వార్డుల్లో చేపట్టిన, చేపట్టబోయే వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ఎన్నికల విధులు నిస్వార్థంగా నిర్వర్తించాలి

- అవగాహన సదస్సులో కొవ్వూరు డీఎస్పీ రామారావు
- హాజరైన గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లోని సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు



సదస్సులోమాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

దేవరపల్లి, ఫిబ్రవరి 12: నిస్వార్థంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని కొవ్వూరు డీఎస్పీ సీహెచ్ రామారావు అన్నారు. దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ మీఎల్ఎం డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొవ్వూరు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ప్రతి సెక్టార్ పోలీస్ అధికారి ఇంతకముందు జరిగిన ఎన్నికల్లో పోలింగ్‌స్టేషన్ పరిధిలో జరిగిన గొడవలు, కొట్లాటలు గుర్తించాలని, ఏకపక్షంగా ఎన్నికలు జరిగిన ప్రదేశాలు, ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన వారిని ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసిన సంఘటనలు గుర్తించాలన్నారు. రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకుని సమస్యలు సృష్టించే వ్యక్తులను ముందుగా గుర్తించి వారిని బైండోవర్ చేయాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి ఎన్నికల నియామవళి ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. గంజాయి, సారా, మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేయాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో దేవరపల్లి, నల్లజర్ల, ధవళేశ్వరం సీఐలు కె.రామకృష్ణ, రామకృష్ణ, వినయమోహన్, దేవరపల్లి ఎస్ఐ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ డీఎస్పీగా అంబికా ప్రసాద్



ఎస్పీ జగదీశ్‌కు మొక్క అందిస్తున్న డీఎస్పీ ప్రసాద్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సౌత్‌జోన్ డీఎస్పీగా నియమితులైన ఎం.అంబికా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. జోన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సౌత్‌జోన్ డీఎస్పీని కలిసిన కడియం సీఐ

కడియం, ఫిబ్రవరి 12: సౌత్‌జోన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.అంబికాప్రసాద్‌ను రాజమహేంద్రవరంలో సోమవారం కడియం సీఐ బి.తులసీధర్ కలిసారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లంకలో భూములు పొందిన దళితులపై వివక్ష

- నేటికీ సర్వే చేసి లబ్ధిదారులకు అప్పగించని వైనం
- ఆర్డీవో కార్యాలయం వద్ద చిడిపి గ్రామస్థుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న చిడిపి గ్రామస్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 12: గోదావరి మధ్య లంకల్లో దళితులకు కేటాయించిన భూములను సర్వేచేసి అప్పగించాలని చిడిపి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన దళితులు గోదావరి మధ్య లంకలో తమకు కేటాయించి పట్టాలు ఇచ్చిన భూములను సర్వేచేసి అప్పగించాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైసీపీ నాయకుడు పామెర్ల నగేష్, ఎంపీటీసీ నడిపల్లి అప్పారావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దళితులు 97 మందికి 2023 డిసెంబరు నెలలో ఒక్కొక్కరికి 0.65 సెంట్లు భూమి కేటాయించి హోం మంత్రి తానేటి వనిత పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా అధికారులు భూములు సర్వేచేసి అప్పగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. లంకలో పట్టాలు పొందిన లబ్ధిదారులు దళితులని వివక్ష చూపుతున్నారన్నారు. హోం మంత్రి, జిల్లా కలెక్టర్, తహశీల్దార్లకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. మరో 3 నెలలు గడిస్తే గోదావరికి వరదలు వచ్చి పంట వేసుకునే అవకాశం ఉండదన్నారు. అధికారులు స్పందించి భూమిని సర్వే చేసి పట్టాలు అందించిన లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.రవికుమార్, కె.ప్రవీణ్‌కుమార్, బి.రాజశేఖర్, ఎస్.రమేష్, ఎస్.మంగరాజు, కె.విజయలక్ష్మి, చెల్లే వెంకటలక్ష్మి, సుజాత, కె.శైలజ, బి.ధనలక్ష్మి, జి.దుర్గ పాల్గొన్నారు.

'స్పందన'కు 11 ఫిర్యాదులు

డివిజనల్ స్పందనలో 11 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఇన్‌చార్జి ఏవో కె.రవి విక్రమ్ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజనల్ స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి పోలీసు 1, పంచాయతీరాజ్ 2, రెవెన్యూ 4, హెల్త్ 1, మున్సిపాల్టీ 2, ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి 1 దరఖాస్తును స్వీకరించామన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సువర్ణవేణికి విద్యారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సువర్ణవేణి

కడియం, ఫిబ్రవరి 12: కడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బూసి సువర్ణవేణికి విద్యారత్న నేషనల్ అవార్డు-2024 లభించింది. తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయాధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు హెచ్ఎం సత్యనారాయణ, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు



పెరవలి: ఇంటింటికీ ప్రచారం చేస్తున్న సంఘ నాయకులు

పెరవలి, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసగా సంయుక్త కిసాన్ మోర్చ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ సమ్మెను రైతులు, వ్యవసాయ కూలీలు జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్కామల, అన్నవరప్పాడు, కానూరు గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.కొండలరావు మాట్లాడుతూ ఈ నెల 16న జిల్లా వ్యాప్తంగా బ్యాంక్‌లు, పోస్టాఫీసులు తదితర కేంద్ర సంస్థలన్నీ స్వచ్ఛందంగా మూసి వేసి మద్దతు తెలపాలన్నారు. సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి సమావేశంలో పాల్గొన్న పలు కార్మిక సంఘాల నాయకులు

దేవరపల్లి: దేవరపల్లిలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విలేర్ల సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమ్మె జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదిస్తూ నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకురావడం దారుణమన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. రవాణా రంగంలో తీసుకొచ్చిన చట్టాలతో కార్మికులకు భద్రత లేకుండాపోయిందన్నారు. ఈ నెల 16న జరిగే పారిశ్రామిక, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు టీపీ లక్ష్మి, ఐనపర్తి శ్రీనివాసరావు, తొర్లపాటి ఇందిరా, ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సత్యనారాయణ, కె.రత్నాజీ పాల్గొన్నారు.

బీసీలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు

- జయహో బీసీ సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల



బొమ్మూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 12: అబద్ధపు హామీలు, కల్లబొల్లి కథలు చెప్పి అధికారంలోకి వచ్చాకా జగన్‌రెడ్డి బీసీలను వెన్ను పోటు పొడిచారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మండిపడ్డారు. బొమ్మూరులోని నరశింహరాజు కల్యాణ మండపంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో సగ భాగమైన బీసీలను ఏనాడూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మొదటి నుంచి బీసీలకు టీడీపీ అండగా ఉందని, పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి వారికి సమాజంలో గౌరవాన్ని కల్పించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకా 300 మంది బీసీలను పొట్టనపెట్టుకుందని, వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా జైలుకు పంపించారన్నారు. కార్యక్రమంలో మత్యేటి శివసత్య ప్రసాద్, చెల్లుబోయిన శ్రీను, మార్గాని సత్యనారాయణ, నూర్ బాషా, షేక్ సుభాన్, మేడిశెట్టి శ్రీను వెలుగుబంటి నాని, పందూరి అప్పారావు, పిన్నింటి ఏకబాబు పాల్గొన్నారు.



కోరుకొండలో మాట్లాడుతున్న బీవీఆర్ చౌదరి

టీడీపీ గెలిచే స్థానాల్లో రాజానగరం మొదటిది : బీవీఆర్

కోరుకొండ, ఫిబ్రవరి 12: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని జిల్లాలో అత్యధిక మెజార్టీతో టీడీపీ గెలిచే స్థానాల్లో రాజానగరం మొదటి స్థానంలో ఉంటుందని పార్టీ నియోజకవర్గ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిపై నెలకొన్న పరిస్థితులను అందరూ గమనించాలన్నారు. జనవరి 26న రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించినప్పటికీ దానిపై ఇంత వరకు టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి ఎటువంటి సమాచారం లేదన్నారు. రానున్న రోజుల్లో వారిద్దరూ కలిసి చర్చించి ప్రకటించే వరకు టీడీపీ క్యాడర్ క్రమశిక్షణతో ఉండాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే పని చేయబోమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తమ అజెండా అన్నారు. సమావేశంలో తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశరావు, గంగిశెట్టి సత్తిబాబు, తోటకూర నాగేశ్వరరావు, అడపా వీరబాబు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి ఎస్ఐను తొలగించండి

- జిల్లా కలెక్టర్‌కు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు



కలెక్టర్ మాధవీలతకు ఫిర్యాదు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

రంగంపేట, ఫిబ్రవరి 12: రాబోయే 2024 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తిస్తున్న రంగంపేట ఎస్ఐను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను కోరారు. అలాగే అనపర్తి నియోజకవర్గంలో అతి సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా చర్యలు ఏర్పాట్లు తీసుకోవాలని కోరారు. ఈ మూడు విషయాలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, వెంకటరామారెడ్డి, దేవదానబాబు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ప్రాంగణంలో వైసీపీ జెండా దిమ్మను తొలగించండి

రాజానగరం, ఫిబ్రవరి 12: కొత్తతుంగపాడు గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఇటీవల వైసీపీ నాయకులు నిర్మించిన పార్టీ జెండా దిమ్మను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ప్రెసిడెంట్ యాళ్ల మాచరయ్య ఎంపీడీవో కనకరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాచరయ్య మాట్లాడుతూ సచివాలయ ప్రాంగణంలో పార్టీ జెండా దిమ్మ నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శికి ఇప్పటికే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే పార్టీ జెండా దిమ్మను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రంపయర్రంపాలెం శోకసంద్రం

విద్యార్థుల మృతదేహాలకు అంత్యక్రియలు



రంపయర్రంపాలెంలో అంత్య క్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం, ఫిబ్రవరి 12: రంపయర్రంపాలెం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆదివారం రంపచోడవరం పరిధిలోని సీతపల్లి వాగులో పడి మృతి చెందిన కాకర వీరవెంకట అర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రామన్ జీ మృతదేహాలు పోస్టుమార్టం అనంతరం సోమవారం రంపయర్రంపాలెం చేరుకున్నాయి. మృతులను కడసారిగా చూసేందుకు గ్రామస్థులంతా వచ్చా రు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన ముగ్గురి మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరయ్యారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు రంపయర్రంపాలెం చేరుకొని విద్యార్థుల పార్థివదేహాలను సందర్శించారు. అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర సాగింది. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం, ఫిబ్రవరి 12: జేగురుపాడులోని ది పేతురు మెమోరియల్ ప్రార్థనా మందిరంలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. పాస్టర్ కె.శ్యామ్‌కుమార్ దేవుని వాక్య సందేశం అందించారు. సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వరంజ్యోతి, ఎం.కరుణాకర్, కె.జయశీల్, రత్నదీప్, డి.రతన్‌రాజు, సోలోమాన్ పాల్గొన్నారు.

వేమగిరిలో వైద్యశిబిరం

కడియం, ఫిబ్రవరి 12: వేమగిరిలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, ఈలి గోపాలం, నరాల మోహన్, మెల్లిమి భాస్కరరావు పాల్గొన్నారు.

వృత్తి కోర్సుల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రధానం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 12: విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సుల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రధానమని ఉండ్రాజవరం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం హైస్కూల్‌కు చెందిన 9, 10 తరగతుల వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సులపై క్షేత్రస్థాయి ప్రదర్శనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు హెచ్ఎం చెప్పారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ల్యాబ్ పనితీరును వారికి చూపించి అవగాహన కల్పించినట్టు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు అదనంగా మరో ట్యాంక్‌ను నిర్మించాల్సి ఉందని దీని కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి వేణు అధికారులను ఆదేశించారు.